www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 మే 2024
5
తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ, డిఎస్పి బదిలీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ ఎన్నికల అనంతరం జిల్లాలో చోటు చేసుకున్న ఘర్షణలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్, డీఎస్పీ సురేంద్ర రెడ్డి లను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 13వ తేదీ పోలింగ్ ముగిసిన రోజు రాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి పై, ఆ పార్టీ నాయకులపై జరిగిన దాడులు, కార్లు దగ్ధం, 14వ తేదీ శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీలో టిడిపి అభ్యర్థి పులివర్తి నాని పై జరిగిన దాడి ఘటనపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. దీంతోపాటు రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలపై సిఎస్, డిజిపి లను వివరణ కోరడంతో వారు గురువారం హుటా హుటిన ఢిల్లీకి చేరుకొని, ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చారు. రాష్ట్ర ఉన్నతాధికారుల వివరణ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఎస్పీలు, కలెక్టర్, డీఎస్పీ లపై చర్యలు చేపట్టారు. అందులో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, వెస్ట్ డిఎస్పి సురేంద్రారెడ్డి లను బదిలీ చేస్తూ, పోలీస్ హెడ్ క్వార్టర్ లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.వెస్ట్ డిఎస్పి సురేంద్రరెడ్డి పులివర్తి నానిపై దాడికేసులో నిందితులను పట్టుకున్నందుకు గురువారం ఆయనకు రివార్డు ఇవ్వడం గమనార్హం.

కన్నతల్లి...తల్లడిల్లి..!

ఒకే కుటుంబంలో ముగ్గురు బాలికలు మృతి

ఆర్‌ఎంపి ఇంట తీవ్ర విషాదం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా)

వేసవి సెలవుల్లో సరదాగా చెరువులో ఈతకెళ్లిన ముగ్గురు విద్యార్థులు లోతట్టు ప్రాంతంలో ఇరుక్కుని మృతిచెందారు. వడమాలపేట మండలం శ్రీబొమ్మరాజపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపి డాక్టర్ పి.బాబు, విజయ దంపతుల ముగ్గురు పిల్లలు ఉషిక (17), చరిత (14), రిషిక (10) ఊరును ఆనుకుని ఉన్న ఆలయానికి వెళ్లారు. చెరువులో కాళ్లు కడుక్కుంటూ ఒకరితరువాత ఒకరు జారిపడిపోయారు. లోతట్టు ప్రాంతంలో తల్లి చూస్తుండగానే మునిగిపోయారు. ఉషిక ఇంటర్ పూర్తయ్యింది. చరిత తొమ్మిదో తరగతి చదువుతోంది. రిషిక ఐదో తరగతి చదువుతోంది. గ్రామస్తులు తెలుసుకుని పిల్లలను చెరువులోనుంచి బయటకు తీశారు. స్థానికులు వడమాలపేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పిల్లలు ముగ్గుర్ని ఒకేసారి కోల్పోయిన ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. ఈ ఘటనతో గ్రామంలోనూ, పిల్లలు చదివే పాఠశాలల్లోనూ విషాదం అలముకుంది.

జాతర... జరా జాగ్రత్త...!

నివురు గప్పిన నిప్పులా తిరుపతి
144 సెక్షన్ ఉన్నా భారీ ర్యాలీలు
ఏ వేషంలోనైనా పొంచిఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎన్నికల రోజు చిన్నచితకా గొడవలు జరగడం పరిపాటే. అయితే తిరుపతి చరిత్రలో గతంలో ఎపుడూ జరగని విధంగా యువత, విద్యాలయాలే కేంద్రంగా పోలింగ్ మరుసటి రోజు గొడవలు చోటు చేసుకోవడం శోచనీయం. అసలే తిరుపతి జాతర, ఆపై ముగియని ఎన్నికల గొడవలతో తిరుపతి నివురు గప్పిన నిప్పులా ఉంది. పోలీసు భద్రత లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎన్నికల సందర్భంగా బందోబస్తు ఇవ్వలేమని జాతరను వాయిదా వేసిన విషయం విధితమే. భద్రత కల్పించాల్సిన పోలీసులు ఆయోమయంలో ఉండడం గమనార్హం.

తిరుపతి గంగజాతర చాలా ప్రసిద్ధిగాంచింది. దుష్టశక్తులను రూపుమాపేందుకు అమ్మవారు స్వయంగా వెలిసారని చరిత్ర చెబుతోంది. రాయలసీమలోనే అది పెద్ద పండగ తిరుపతి జాతర. వారం రోజుల పాటు స్థానికులు వివిధ వేషదారణలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. చివరిరోజు అమ్మవారి విశ్వరూప ప్రదర్శనతో జాతర ముగుస్తుంది. ఈ వేడుకలకు జిల్లా వాసులేగాక సమీప జిల్లాలైన నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, కదరి ప్రాంతాల నుంచేగాక సరిహద్దు రాష్ట్రాలైన కర్టాటక, తమిళనాడు నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు జాతరకు వస్తారు. వాస్తవానికి ఈ జాతరను మే 7 నుంచి 14వ తేది వరకు నిర్వహించాల్సి ఉన్నా, ఎన్నికల నేపథ్యంలో భద్రత కల్పించలేమని జిల్లా అధికార యంత్రాంగం చేతులు ఎత్తేయడంతో విధిలేని పరిస్థితుల్లో ఆలయ నిర్వాహకులు ఏకపక్షంగా జాతరను వాయిదా వేశారు. ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత నిర్వహించాలని నిర్ణయించి, ఈ నెల 14 నుంచి 22 తేది వరకు జాతర జరుపుతున్నారు. లక్షలాది మంది ప్రజలు పాల్గొనే జాతరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల రౌడీయిజాలు, గుండాయిజాలు అధికం అయ్యాయి. మద్యం మత్తులో జరిగే చిన్న చిన్న గొడవలు సైతం కత్తిపోట్లు, సీసాల దాడుల వరకు వెళుతున్నాయి. జాతర రోజుల్లో మద్యం ప్రియులు మరింత మత్తులో ఉంటారు. దీనికి తోడు పలు మత్తు పదార్థాలకు అలవాటు పడిన జులాయిలు ద్వారా తరుచూ ఏదో ఓ చోట గొడవలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జాతరల్లో మరింత భద్రత అవసరం. కానీ ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు పరిశీలిస్తే పోలీసులు ఆ మేరకు భద్రత కల్పిస్తారనే విషయంలో ప్రజలకు సందేహాలు లేకపోలేదు. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు తిరుపతిలో చోటు చేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. ఇప్పడు తిరుపతిలో లోకల్, నాన్ లోకల్ అంటూ ఎన్నిక ఆరోపణలు ఉన్నాయి. పైగా కడప రౌడీలు, చిత్తూరు రౌడీలు తిరుపతిలో తిష్టవేసి అలజడులు సృష్టిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దానికి బలం చేకూర్చేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయి. ఒకే పార్టీలో ఉండి, ఈ ఎన్నికల్లో ప్రత్యార్థులుగా మారిన ఇద్దరు అభ్యర్థులు ఒకరిపై మరొక్కరు గుర్రుగా ఉన్నారు. వీళ్ల ఎత్తులకు ఆఖరికి విలేకర్లు సైతం బలిపశువులు కావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాబోవు రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంతలోనే జాతర వచ్చింది. జాతర ప్రారంభం రోజే ఓ అభ్యర్థి పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మరో పార్టీకి చెందిన నాయకులు అదే రోజు ఆలయం వద్ద గోడపత్రికలు ఆవిష్కరించారు. ఇరువర్గాలు ఎదురైతే మళ్ళీ గొడవులు జరుగుతాయేమోనని అందరూ భయపడ్డారు. ఆనవాయితీగా సిట్టింగ్ ఎంఎల్‌ఏ గురువారం భారీ ఎత్తున అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా వేలాది మందికి బోజనాలు ఏర్పాటు చేసి, బారీస్థాయిలో ర్యాలీగా ఆలయం వద్దకు చేరుకున్నారు. తాము కూడా సారె ఇచ్చేందుకు కూటమి నాయకులు పోటాపోటీగా సిద్దమయ్యారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ ఉండగానే ఇలా భారీ ర్యాలీలకు పోలీసులు ఎలా అనుమతిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జాతరకు భద్రత కల్పించలేమని ముందుగానే ప్రకటించి, వాయిదా కోరిన అధికార యంత్రాంగం, ప్రస్తుత తరుణంలో ఎలా వ్యవహరిస్తుందోనని అనుమానాలు ప్రజల్లో లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం. పోలీసులు సమన్వయం చూసుకుంటూ, అప్రమత్తంగా ఉంటూ గంగజాతరల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజలకు భద్రత కల్పించి, శాంతిభద్రతలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మొక్కు తీర్చుకున్న భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డిలు

13 మంది అరెస్టు

నానిపై హత్యాయత్నం కేసులో...

కడప సబ్‌జైలుకు తరలింపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నాని పై జరిగిన హత్యాయత్నం కేసులో 13 మందిని అదుపులో తీసుకొని, కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు జిల్లా ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ తెలిపారు. గురువారం అయిన కేసు వివరాలు మీడియాకు వెల్లడిస్తూ... స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఈవీఎం బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీసమేతంగా స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించేందుకు మహిళా యూనివర్సిటీ కి వచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మెయిన్ గేటు వద్ద భాను కుమార్ రెడ్డి, గణపతి రెడ్డి వారి అనుచరులు ముదిపల్లి జానకి రెడ్డి, జానయ్య గారి జయ చంద్రారెడ్డి, పొదలకూరు కోదండమ్, బొక్కసం చిరంజీవి, దండు పుష్పకాంత్ రెడ్డి, ఎద్దల భాస్కర్ రెడ్డి, కామసాని సాంబ శివ రెడ్డి, అప్పన్నగిరి సుధాకర్ రెడ్డి, పి హరికష్ణ, పసుపులేటి రాము, గోగుల కోటయ్యలు పులివర్తి నానిని అడ్డగించి వారిపై సమ్మెట, రాడ్లు, క్రికెట్ బ్యాట్లు, రాళ్లు, బీర్ బాటిళ్లు వంటి వాటితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిని పులివర్తి నాని గన్మెన్ ధరణి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అతనిపై కూడా సమ్మెటతో తీవ్రంగా దాడి చేశారు, రక్త గాయాలైన అతను తన ప్రాణ రక్షణ కోసం గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరపడంతో భాను కుమార్ రెడ్డి, గణపతి రెడ్డి వారి అనుచరులు ఘటనా స్థలం నుండి పారిపోయారని తెలిపారు. ఈ కేసును సవాలు తీసుకున్న జిల్లా పోలీసులు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి విస్తతంగా గాలింపు చేపట్టారన్నారు. పోలీసులకు చెందిన కచ్చితమైన సమాచారం మేరకు గురువారం నిందితులు 13 మందిని అదుపులో తీసుకున్నామని వెల్లడించారు. ఈ కేసులను 24 గంటల లోపే ఛేదించిన తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి, సిసిఎస్ డిఎస్పి రవికుమార్ ఎస్వీయూ క్యాంపస్ సిఐ మురళీమోహన్ రావు, ఎస్ఐ రామాంజనేయులు, అంజనప్ప, ఐడి పార్టీ సిబ్బంది ఏఎస్ఐ దామోదర్, మోహన్ బాబు, ఈశ్వర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులను ప్రకటించారు.



పులివర్తి నానిని పరామర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు

నానిని పరామర్శించిన రఘురామ కృష్ణంరాజు

ప్రజాశక్తి -రామచంద్రపురం

శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆవరణంలో మంగళవారం సాయంత్రం వైసిపి రౌడీ మూకలు చేసిన దాడిలో గాయపడిన చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)ను ఎంపీ రఘురామ కష్ణంరాజు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం సుగుణమ్మ లు గురువారం సాయంత్రం రఘునాథ రిసార్ట్స్ లోని పులివర్తి నాని ఇంటి వద్ద పరామర్శించారు. వైసిపి నాయకుల చేసిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. అనంతరం పులివర్తి నాని కుటుంబ సభ్యులను కలసి అధైర్య పడకండి, ఎన్నికల్లో పులివర్తి నాని ఘనవిజయం సాధించడం ఖాయమని భరోసా ఇచ్చారు. టిడిపికి 120-150 సీట్లు ఖాయమన్నారు. పవన్‌కల్యాణ్‌కు పిఠాపురంలో 55వేల మెజార్టీ వస్తుందన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, శ్రీధర్ వర్మ, బ్యాంకు శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాల దాతృత్వం

డ్రైవర్ బిడ్డకు ఆర్థిక భరోసా
రూ.లక్ష 7వేలు... రూ.2.60 లక్షలుగా
మెచ్యూరిటీ డబ్బు వర్షితకు అందజేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సాయం అంటే ఇలా ఉండాలి.. తమ తోటి ఆటోడ్రైవర్ కుటుంబం ఇక లేదన్న వార్త విని తల్లడిల్లిపోయారు.. దంపతుల కూతురు వర్షితకు ఆర్థిక సాయం చేయాలని తలచారు. తిరుపతి నగర పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న సుదర్శన్ ఆటో స్టాండ్‌కు చెందిన ఆటోవాలాలు తమవంతు సాయంగా 103 మంది కలిసి విరాళాలు సేకరించి లక్ష 7వేలు సేకరించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ప్రస్తుతం 11 ఏళ్ల తరువాత మెచ్యూరిటీ అయిన సొత్తును వర్షితకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో అందజేశారు. స్ఫూర్తిదాయక ఘటన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.

ఎక్కడో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో డ్రైవర్ సిద్దయ్య అతని భార్య లక్ష్మీదేవి మరణించారు. వారికి ఒక పాప సంతానం. ఈ సమాచారాన్ని అందుకున్న తిరుపతి నగర పరిధిలోని రైల్వే స్టేషన్ వద్దనున్న సుదర్శన్ ఆటో స్టాండ్ కు చెందిన ఆటోవాలాలు తమ వంతుగా సాయం అందించాలని ఆటో స్టాండ్ లోని 103 మంది సభ్యులు ప్రతినబూనారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అంతట సైకిల్ పై సుదర్శన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో తిరుగుతూ విరాళాలు సేకరించి లక్ష 7వేల రూపాయలను చనిపోయిన డ్రైవర్ పాప రెడ్డి వర్షిత పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. 11 సంవత్సరాల క్రితం వేసిన ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ సమయం జరిగి రూ. 2.60 లక్షలుగా వచ్చాయన్నారు. ఈ పూర్తి నగదును కలికిరి సమీపంలోని గ్రామంలో నిర్మలమ్మ(రెడ్డివర్షిత అమ్మమ్మ) సంరక్షణలో ఉన్న రెడ్డివర్షిత(14)కు గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ వేదికగా సుదర్శన్ ఆటో స్టాండ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా ఆ నగదును అందించారు. పాప రెడ్డి వర్షిత ఉన్నత చదువులు కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సాటి డ్రైవర్ కుటుంబానికి చేసిన ఈ ఉన్నత సహాయం చాలా గొప్పదన్నారు. రెడ్డివర్షిత ఏ చదువు చదువుతుందో దానికి అయ్యే పూర్తిఖర్చు మొత్తం తన ట్రస్టు ద్వారా భరిస్తామని హామీ ఇచ్చారు. ఇంతే కాకుండా దేశంలో ఎటువంటి విపత్తు వచ్చిన మొదట సహాయం చేసే చేతులుగా ముందుకు వచ్చేది సుదర్శన్ ఆటో స్టాండ్ ఆటోవాలాలన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిని సందర్శించే యాత్రికులు ఏదేని ఆటోల్లో వస్తువులు జారవిడుచుకుంటే ఎంతో నిజాయితీగా ఈ ఆటో స్టాండ్ కు చెందిన సభ్యులు సంబంధిత పోలీస్ స్టేషన్లో ఆ వస్తువులను అప్పగించడం జరుగుతోందన్నారు. నిబద్ధత కలిగిన ఆటో యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ నాయకులు ఐఎస్ ఖాజా, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తండ్రి నేత్రాలు దానం చేసిన తనయుడు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రుయాలో చనిపోయి సి.వి వెంకటరమణ (64) గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతని నేత్రాలను దానం చేయడానికి కొడుకు యశ్వంత్‌కుమార్ ముందుకొచ్చారు. రుయా కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతి రెడ్డి ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి నేత్ర విభాగ, నేత్ర నిధి బ్యాంకులో డిపాజిట్ చేశారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు నేత్రాలు, అవయవాలు దానం చేయడం వల్ల పేద రోగులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ అవయవాలను వారికి ఉచితంగా అమర్చడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పురప్రజలు ఎవరైనా నేత్రదానం చేయాలంటే 8500880126 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేత్ర విభాగ టెక్నీషియన్ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

విన్నారు.. కన్నారు..నొక్కారు..!

పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభం
అంతుచిక్కని వెంకటగిరి ఓటరు నాడి
నియోజకవర్గంలో ఆసక్తికర చర్చలు

ప్రజాశక్తి- డక్కిలి

'అన్నా ... ఈసారి వెంకటగిరిలో ఏ పార్టీ గెలుస్తుందంటవ్.. మీ ఊర్లో ఓట్లు ఎక్కువ ఏ పార్టీకి పడ్డాయ్.... మా దగ్గరైతే ఎవరు ఏ పార్టీకి వేశారో బయటపడటం లేదు..' అంటూ ప్రస్తుతం వెంకటగిరి నియోజకవర్గం అంతటా ఎన్నికలపైనే చర్చ నడుస్తోంది. పోలింగ్ పూర్తయి మూడురోజులైనా.. ఎక్కడ.. ఏ నలుగురు కలిసినా.. ఇదే ముచ్చట వినిపిస్తోంది. నియోజకవర్గ రాజకీయ సంగతులే గాక తిరుపతి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నియోజకవర్గాల పోలింగ్ తీరు గురించి ఆసక్తిగా అడుగుతున్నారు. ఫలితాల విషయంలో మాత్రం ఎవరూ ఓ అంచనాకు రాలేకపోతుండటం గమనార్హం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ ఆసక్తికరంగా సాగింది. పోలింగ్ పెరగడంతో ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వెంకటగిరి నియోజకవర్గంలో ఎన్నికలు ముగిసినా.. ఎవరికి అధికారం అన్నది మాత్రం అంతుచిక్కకుండా ఉంది. 80.30 శాతం పోలింగ్ నమోదయింది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు క్యూ కట్టారు. గతంలో ఏ ఎన్నికల్లో చూడని విధంగా అర్థరాత్రి దాటేంత వరకూ పోలింగ్ జరిగింది. ఇది ఎవరికి లాభం? ఎవరికి నష్టం అన్నది మాత్రం ఎవరికీ అంతుచిక్కకుండా ఉంది. చివరకు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఏజెంట్లు కూడా ఆ బూత్ లో ఓటర్లు ఎవరు ఎటువైపు మొగ్గ చూపుతున్నారని ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఇందుకు కారణం ఓటర్లందరూ గుంభనంగా ఉండటమే. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా స్థానికంగా ఏ పార్టీ నేత కనిపించినా నవ్వుతో పలుకరిస్తుండటం కూడా అంచనాలకు అందడం లేదు. అయితే ఎవరికి వారే తమ పార్టీదే అధికారం అన్న ధీమాలో ఉన్నారు.

వైసీపీ ధీమాగా...

పోలింగ్ కు వచ్చిన వారిలో అధిక శాతం మంది తమకే ఓటు వేసి ఉంటారని భావించి ఇటు అధికార వైసీపీ కానీ, అటు ప్రతిపక్ష కూటమి నేతలు కూడా ధీమాగానే కనిపిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని వెంకటగిరి ప్రాంత రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వంపై ఆగ్రహం ఉంటే ఆ స్థాయిలో అర్ధరాత్రి వరకూ వేచి ఉండి ఓటు వేసేవారా? అని అధికార పార్టీ ప్రశ్నిస్తుంది. ఇది పాజిటివ్ ఓటుగానే తాము భావిస్తామని వైసీపీ శ్రేణులు చెప్తున్నారు. నవరత్నాలు లబ్ధిదారులు, మహిళలు, వద్దులు ఓటింగ్ లో అధికంగా పాల్గొనడం తమ పార్టీకే అనుకూలమని వైసిపి ధీమా వ్యక్తం చేస్తుంది.

టీడీపీ వాదన ఇలా...

ఈ ప్రభుత్వం పోతేనే తమ బతుకులు మారతాయని భావించి ఓటర్లు కసితో ఉన్నారని, అందుకే ఎంత సమయమైనా వేచి ఉండి మరీ ఓటు వేసి ఈ ప్రభుత్వాన్ని దించడమే లక్ష్యంగా పెట్టుకుని క్యూ లైన్లలో గంటల తరబడి నిలుచున్నారన్నది కూటమి నేతల వాదన. ఉద్యోగుల తో పాటు, ఇతర ప్రాంతాల నుంచి ఓటింగ్ కోసం భారీగా తరలివచ్చిన సాఫ్ట్వేర్ ఇంజనీర్లు , యువత ,తమ పార్టీకే అండగా నిలిచారని అందుకే తమలో అంత కాన్ఫిడెన్స్ ఉందని అంటున్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారని తాము భావిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలియజేస్తున్నారు.

విశ్లేషకులు మాత్రం...

అయితే విశ్లేషకులకూ ప్రజల నాడి అందడం లేదు. మహిళలు, వద్దులు, యువత అధిక సంఖ్యలో రావడంతో కొంత అటుఇటుగానే ఫలితాలు ఉంటాయని అంచనాలు వినపడుతున్నాయి. ఎవరు గెలిచినా నాలుగు నుంచి ఐదు వేల లోపు ఓట్ల మెజారిటీ ఉంటుందని ఎక్కువ మంది రాజకీయ విశ్లేషకులు అంచనా. 2019లో వెంకటగిరిలో అప్పటి వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డికి వచ్చిన భారీ మెజారిటీ మాదిరి వన్ సైడ్ ఎన్నికలు మాత్రం ఈసారి జరగలేదన్నది అందరూ అంగీకరించే వాస్తవం. మహిళలు ఎవరివైపు మొగ్గు చూపితే వారిదే అధికారం. అందుకే మహిళ ఓటర్లు సంక్షేమ పథకాలకు ప్రభావితులయి ఓటు వేశారా? లేదా మార్పుకోసం కొంగు బిగించారా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంటుందన్నారు. మరి జూన్ 4వ తేదీన గాని ఎవరు విజేత అన్నది తెలియదు.

'నడ్డి' విరుస్తున్న గతుకుల 'రోడ్డు'

సత్యవేడు-ఊత్తుకోటలో ప్రయాణం నరకం

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు - ఊతుకోట రహదారిలో రెగ్యులర్‌గా వాహనాల్లో తిరిగితే మాత్రం నడ్డి విరగాల్సిందే. నడుం చుట్టూ బెల్టు బిగించాల్సిందే.. అంతటి ఘోరంగా ఉంది ఆ రహదారి.. వర్షాలకు ఏర్పడిన గుంతలకు ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆ రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది.

ఈ రోడ్డు ఇటు తిరుపతి జిల్లా సత్యవేడును తమిళనాడు ఊత్తుకోటను కలిపే ప్రధాన రహదారి. సత్యవేడు నుండి పుత్తూరు ద్వారా తిరుపతికి వెళ్లే వాహనాలన్నీ ఈ రహదారి వైపే వెళతాయి. శ్రీ సిటీకి సంబంధించిన రవాణా వాహనాలు, అందులో పనిచేసేవారి వాహనాలన్నీ ఈ రహదారి మీదే పోతాయి. ఈ రహదారి ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ రోడ్లపై ఏర్పడిన గతుకులు గుంతల వల్ల ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు, రోడ్ల దుస్థితి తమ నడ్డిని విరుస్తున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం వలన వాహనాలకు పదేపదే టైర్లు మార్చాల్సి వస్తోంది. పదే పదే సర్వీస్ చేయించడం వల్ల, ఆరోగ్య సమస్యలు తలెత్తడం వల్ల అయ్యే ఖర్చు భరించలేకున్నామని తమ బాధను వ్యక్తపరిచారు. రోజూ ప్రయాణికులను ఎక్కించుకొని తిరిగే ఆటోవాలాల పరిస్థితి కూడా ఇంతేనని చెప్పుకొచ్చారు. ఈ రోడ్లలో సుమారు మూడు నుండి నాలుగు అంగుళాల లోతులో గుంతలు ఉండటం, అందులో ఉన్న కాంక్రీట్ రాళ్లు కూడా బయటకు రావడంతో వాహనదారులు వాహనాన్ని అదుపు చేయడం కష్టతరం కావడం వల్ల పదేపదే ప్రమాదాలకు గురవుతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఇదే రోడ్డుపై యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ మట్టిని తరలించడం ద్వారా ఈ రోడ్లకు ఈ దుస్థితి ఏర్పడిందని, ఇసుకకు రవాణా వాహనాలకు చలానాల ద్వారా రుసుము వసూలు చేసే ప్రభుత్వ యంత్రాంగం కాస్త ఈ రోడ్ల దుస్థితిని పరిశీలించి మరమ్మత్తులు చేపట్టి ఉంటే బాగుంటుందని ప్రతిఘటించారు. రానుంది వర్షాకాలం కావడంతో ఇప్పుడే రోడ్ల మరమ్మతులను పూర్తి చేయకుంటే ఈ రోడ్లు మరింత దుస్థితికి చేరుకుని రవాణా కష్టతరం అవుతుందని వాహనదారులు వ్యాఖ్యానించారు. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు గతుకుల రోడ్డుపై దష్టి పెట్టి గోతులను గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎటువైపు వెళ్లినా గతుకుల రోడ్లే

జర్నలిస్టుల పోరాటానికి సిఐటియు మద్దతు

- సిఐ రామచంద్రారెడ్డిని సస్పెండ్ చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న అనుచిత ధోరణి సరైంది కాదని, జర్నలిస్టుల న్యాయ పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులకు నిరసనగా తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలసి జర్నలిస్టు యూనియన్ నాయకులు గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు జర్నలిస్టులపై దాడులను ఖండించారు. సిఐ రామచంద్రారెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు. పోలీసులు వారి ధర్మాలను విస్మరిస్తూ సమాజంలో కీలకమైన జర్నలిస్టులపై దాడులకు ఆదేశాలివ్వడం దారుణం అన్నారు. సిఐ రామచంద్రారెడ్డి ఇచ్చిన ఆదేశాలతోనే సిఆర్‌పిఎఫ్ బలగాలు మీడియాపై లాఠీ ఛార్జీ చేశాయన్నారు. ఇలాంటి వారు పోలీసు విభాగానికి మచ్చ తెచ్చే వారని, రామచంద్రారెడ్డిని విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని కోరారు. రాజకీయ నాయకులు, పోలీసులు జర్నలిస్టుల జోలికి వస్తే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని సూచించారు. ఎమ్మెల్యే హోదా కలిగిన వ్యక్తి తనపై వచ్చిన వార్తలకు ప్రతిగా బహిరంగంగా బెదిరింపులకు దిగడం, వీడియోలలో ఆరోపణ వ్యాఖ్యలు చేయడం దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అధికార పార్టీ అక్రమాలు కోకొల్లలుగా ఉన్నాయని పలువురు జర్నలిస్టులు రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమైందని, అటువంటి పాత్రికేయుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, టిడిపి నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, టిడిపి లీగల్ సెల్ నాయకులు తమిదలపాటి దినకర్, వెంకటరమణ, డిహెచ్‌పిఎస్ నాయకులు చిన్నంకాలయ్య, సామంచి శ్రీనివాస్, హమాలి వర్కర్స్ నాయకులు ఎన్‌డిరవి, జర్నలిస్టు యూనియన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం

క్రైం న్యూస్

పాల వ్యాను, బైక్ ఢీ

వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: పాల వ్యాను, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ముచ్చివోలు పంచాయతీ పరిధిలో గురువారం పాలు వ్యాను వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..పోతల బలరామయ్య కుమారుడు పోతల సుబ్రహ్మణ్యం (28) శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలో అద్దె బస్సులకు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ముచ్చివోలు ప్రాంతంలో అతివేగంగా ఎదురుగా వస్తున్న పాల వ్యాను బైకును ఢీకొంది. బైక్ మీద ప్రయాణిస్తున్న సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సాయంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుబ్రహ్మణ్యం మృతితో వారి కుటుంబాన్ని పోషించే వ్యక్తి దుర్మరణం పాలు కావడంతో అతని భార్య పిల్లలు బతుకు భారంగా మారిపోతుందని ప్రభుత్వమే వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కిషోర్ ను వివరణ కోరగా మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని అన్నారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు మూడేళ్ల హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజి డిప్లొమ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు 10వ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, 15 సంవత్సరాల నుండి 23 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు అర్హులని తెపారు. లేటరల్ ఎంట్రీ మూడు సంవత్సరాల డి హెచ్‌టిటి కోర్సు లో , ఇంటర్మీడియట్ ఎంపిసి, ఇంటర్మీడియట్ ఒకేషనల్ (టెక్స్టైల్స్), ఐటిఐ (2 సంవత్సరాలు) కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేరుగా డిహెచ్‌టిటి రెండవ సంవత్సంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9399936872, 9866169908, 9010243054 నెంబర్లను నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సీనియర్ వైసీపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని నీర్పాకోటకి చెందిన వైసిపి సీనియర్ కాపు నేత కొండా గిరి తిరుపతిలో వున్న సత్యవేడు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోటి రాజేష్, తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. వైసిపి కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను , అభిమానులను గుర్తించి వారికి తగిన గౌరవం ఇవ్వాలని అభ్యర్థులను కోరామని తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు నేత కొండా గిరి ప్రసాద్, పాల్ గురవయ్య, గోపాల్ రెడ్డి, బుచ్చినాయుడు కండ్రిగ వైసిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులను కలిసిన వైసిపి నాయకులు

ముక్కంటి ఆలయంలో అనధికారిక బదిలీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నాలుగు రోజుల క్రితం అనధికార బదిలీలు చేశారు. వినాయకస్వామి ఆలయం వద్ద పనిచేసే ఎం.చంద్రశేఖర్ (అర్చకుని) రూ.750ల రాహు-కేతు మండపానికి పంపారు. అక్కడ పని చేస్తున్న శ్రీనివాస్ (అర్చకుని)రూ.750ల రాహు-కేతు మండపం నుంచి గురుదక్షిణామూర్తి వద్దకు పంపారు. శ్యామ్ శంకర్ (పరిచారక)ను వినాయకస్వామి ఆలయం వద్దకు పంపారు. ఈ ముగ్గురి బదిలీల సందర్భంగా ఎలాంటి అధికారిర ఉత్తర్వులు ఇవ్వలేదు. కేవలం మౌఖిక ఆదేశాలతోనే ఈ బదిలీలు జరిగాయి. ఈ అనధికారిక బదిలీల కోసం డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆలయ అధికారులు ఇలా చేయడం వలన విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఇకనైనా ఇలాంటి చర్యలకు స్వస్తి చెప్పి పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంది.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్న కొట్టాయి ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. చిన్న కొట్టాయి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. అక్కడ నుంచి ఆలయ ప్రాంగణంలోని పగడ చెట్టు వద్ద దింపి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూడు ప్రదక్షిణలు చేసి దీపారాధన, హారతులు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రధాన ఆలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీవారి పరకామణికి కరెన్సీ కౌంటింగ్ యంత్రం విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి పరకామణికి గురువారం రూ.9.33 లక్షల విలువైన కరెన్సీ కౌంటింగ్ యంత్రం విరాళం గా అందింది. నెల్లూరు కు చెందిన భక్తుడు కాకులూరు వసంత కుమార్, కర్పగవల్లి దంపతులు ఈ యంత్రాన్ని తిరుమల శ్రీవారి పరకామణి డెప్యూటీ ఈవో వంల్లి ఖార్జున్ కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు టీటీడీ అధికారులు అభినందించి, శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

కరెన్సీ కౌంటింగ్ యంత్రాన్ని అందిస్తున్న దాతలు

వర్షానికి ఊరట

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేటలో గురువారం ఉదయం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ప్రజలు కొంత ఊరట చెందారు. ఇటీవల విపరీతమైన ఎండలకు అల్లాడుతున్న ప్రజలు గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ప్రజల ఆనందోత్సాహానికి అవధులు లేకుండా పోయాయి. కొన్ని నెలలుగా వర్షాలు లేక భానుడి భగభగలకు ఇంటి నుండి బయటకు రాలేక అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. రెండు రోజుల క్రితం జరిగిన ఎలక్షన్లలో సైతం ఈ ఎండలకు అల్లాడిపోతూనే ఓట్లు వేసిన ప్రజలకు ఎలాంటి ముందస్తు మబ్బులు, వర్షపు జాడలు లేకుండా హఠాత్తుగా కురిసిన వర్షానికి ఆనందించారు. కొంతసేపు ఈదురు గాలులతో కూడిన వర్షానికి ముందు భయపడినా తర్వాత మెల్లగా గాలులు తగ్గిపోవడంతో పిల్లలు, పెద్దలు ఆనందంతో కేరింతలు కొట్టారు. దాదాపు గంటన్నర పాటు కురిసిన ఈ వర్షానికి నాయుడుపేట రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఓ పక్క వర్షం కురుస్తోందని ఆనందంలో తేలియాడే లోపు బయట కాలు పెట్టలేని పరిస్థితి పరిస్థితి నెలకొంది. ఇటీవల అవసరం లేకున్నా ఇష్టానుసారం ఎక్కడపడితే అక్కడ రోడ్లపై గుంతలు తవ్వేయడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తమయ్యాయి. ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చే డబ్బులకు ఆశపడి నాయకులు , అధికారులు ప్రజల దుస్థితిని పట్టించుకోవడం లేదు. ఎండలు కాస్తుంటే ఎండలకు బయటికి రాలేక, ప్రకృతి దయతో వర్షం వచ్చినప్పుడు ఇళ్ల ముందు నిలిచిపోతున్న మురుగునీటిలో కాలు పెట్టలేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నాయుడుపేటలో ప్రైవేటు సంస్థల కోసం రోడ్లకు నష్టం కలిగిస్తున్నారు. నాయకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు జలమయం..

తేలికపాటి వర్షానికే జలమయమైన రోడ్లు

రోడ్డుపైనే మురుగు!

- వాహన చోదకులకు ఇక్కట్లు
- స్పందించని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్ సమీపంలో ఓ ఇంటి వద్ద డ్రైనేజీలోకి వెళుతున్న మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వాహన చోదకులు ఈ రోడ్డుపైనే వెళ్లాల్సి వుంది. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వెళ్లలేక వారు ఇబ్బందులకు గురవుతున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ఈ సమస్య పరిష్కారం కావడంలేదు. మురుగునీరు కారణంగా ఆ సమీపంలో ఇంటి వారికి దుర్వాసన వస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ పరిసర ప్రాంతాల ప్రజలు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. మురుగునీరు ఇలాగే ఉంటే ఆ దారిన వెళ్లే వారు సైతం ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దుర్వాసన కారణంగా పరిసర ప్రాంత వాసులు రోగాలకు గురయ్యే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు. లేని పక్షంలో హాస్పిటల్ సమీపంలోని గృహాల వారు, వాహన చోదకులు కలిసి మున్సిప ల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతామని పట్టణ ప్రజలు హెచ్చరించారు.

రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

అలిపిరి వద్ద కారు దగ్ధం

ప్రజాశక్తి - తిరుపతి : ఓ కారు మంటలకు దగ్ధమైన సంఘటన స్థానిక అలిపిరి వద్ద గురువారం చోటుచేసుకుంది. అలిపిరి గరుడా సర్కిల్ వద్ద కారులో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ వాహనాన్ని పక్కక నిలిపి వేశాడు. వెంటనే డ్రైవర్‌తో పాటు కారులో నుంచి భక్తులు బయటకు పరుగులు తీశారు. ఆ తరువాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. తిరుమల నుంచి తిరుపతికి తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారులో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మంటలకు దగ్ధమవుతున్న కారు

లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

వైజెపి లయన్స్ క్లబ్ 2024-25 సంవత్సరానికి క్లబ్ నూతన కమిటీని ఎన్నిక చేశారు. వైజెపి లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా పివి మనోజ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో క్లబ్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. గూడూరు టౌన్‌క్లబ్ అధ్యక్షుడుగా సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యు లు చంద్రశేఖర్ రెడ్డి , వేణు రెడ్డి, మురళి రాజు, వెల్లేటి వెంకటరామిరెడ్డి , గోపీనాథ్ రెడ్డి ఎస్ఎల్ఎన్ స్వామి, పసుపులేటి ప్రసాద్, రాజేంద్రప్రసాద్ , పీవీ శివరాం, బండ్ల సుధాకర్, బండ్ల హరికృష్ణ, శీను, మురళి నాయుడు, గురునాథం షేక్ బషీర్ పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతిమయం: వరప్రసాద్ రావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

రాష్ట్రంలో వైసిపి పాలన అవినీతి మయమైపోయింని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఎన్నికల్లో వైసీపీ నాయకుల దౌర్జన్యాలు అంతేలేకుండా పోయాయని తిరుపతి బిజెపి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ పేర్కొన్నారు. గూడూరు జనసేన కార్యాలయంలో వెలగ పల్లి వరప్రసాద్ రావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు అధికమయ్యాయని పేర్కొన్నారు. చిల్లకూరు మండలంలో సిలికా అక్రమ రవాణా వల్ల వ్యవసాయ భూములు, పేదల నివాసాలకు నష్టం వాటిల్లుతోందని అనేకసార్లు ముఖ్యమంత్రికి తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికడతామని తెలిపారు. చిల్లకూరు మండలంలో వైసీపీ నాయకులు టిడిపి నాయకులపై దాడి చేయడం అమానుషమన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పులిమి శ్రీనివాసులు ,పురుషోత్తం రెడ్డి, బిల్లు చెంచురామయ్య, బాలకృష్ణ నాయుడు, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

గురవారెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అంబేద్కర్ విగ్రహం ధ్వంసంపై చర్యలు: తహశీల్దారు

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్ సెంటర్ ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం తలను ధ్వంసం చేసిన వారిని త్వరలో గుర్తించి అరెస్ట్ చేస్తామని అప్పటి వరకు దళిత నాయకులు సంయమనం పాటించాలని వెంకటగిరి తహశీల్దారు పేర్కొన్నారు. రెండు రోజుల నుండి దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన నిర్వహించారు. ఈ నేపథ్యంలో తహశీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వమే అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ తక్షణమే ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సహదేవయ్య, ఎడిపీయస్ గోపాల్, తుపాకుల శ్రీనివాసులు, ఏడిపిఎస్ శంకరయ్య, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, బిసి నాయకుడు హనుమంతు, గద్దెల మునయ్య, ప్రజా కళాకారుడు చెంచు కృష్ణయ్య, వెంకన్న, మార్పు సంస్థ వ్యవస్థాపకులు పవన్, యానాదుల సంఘం జిల్లా నాయకులు పద్మ, పెంచలయ్య, అడవయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి: ఎంపిడివో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ అధికారులకు సూచించారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచుల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు పడేంత వరకు గ్రామాలలో ఎటువంటి తాగునీటి కొరత రాకుండా పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్త వహించాలన్నారు. మోటార్ లు , పైప్ లైన్ లు , బోరింగ్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు కానీ, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని విద్యుత్ శాఖ ఏఈ బాలాజీ ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులను కోరారు. అత్యవసర మరమ్మతులకు గ్రామ పంచాయతీలోని 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు వినియోగించి చర్యలు చేపట్టవచ్చునని తెలిపారు. ఇంటి పన్ను వసూలు నూరు శాతం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఏవైనా లోపాలు ఉంటే ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. నీటి పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నూరు శాతం ఉండేలా ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్ డి తరుణాక్ష రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

డెంగీ, మలేరియాపై అవగాహన

దొరవారిసత్రంలో

ప్రజాశక్తి -దొరవారిసత్రం: డెంగీ ప్రమాదకరమని, అందుకు కారకాలైన దోమల నిర్మూలనే మంచి మార్గం అని దొరవారిసత్రం పిహెచ్‌సి వైద్యాధికారి చైతన్య అన్నారు. గురువారం డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది మండల కేంద్రంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన నివాస పరిసరాల్లో దోమలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప మలేరియా అధికారి రమేష్ బాబు, వైద్యాధికారిణి చంద్రకళ, సూపరు వైజర్స్ కిరణ్, మైథిలి, ఎంఎల్‌హెచ్‌పి తస్లీమ్, మౌనిక, జ్ఞానేశ్వరి, ఏఎన్ఎమ్స్ వెంకమ్మ, శ్రావణి, రమణమ్మ, సౌజన్య డోరతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, విజయ్ కుమార్, రత్నయ్య, వెంకటయ్య, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో డెండీ నివార దినోత్సవ ర్యాలీ , అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు కొట్టకుండా మనల్ని కాపాడుకోవచ్చుని దోమతెరలు వాడటం వేపాకు పొగ వేసుకోవడం ఇతరత్రా పద్ధతుల ద్వారా దోమల బారి నుండి మనల్ని మనం కాపాడుకోవాన్నారు. జ్వరం అనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దివాకర్‌ను కలవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపరు వైజర్ వెంకటేశ్వర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నైనారు కండ్రిగ గ్రామంలో డెంగీ, మలేరియా వ్యాప్తి, నివారణ జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దక్షిత్ రాజు ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాగ సుధా, రామచంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వరలక్ష్మి, సూపరువైజర్ తిరుమలయ్య టిబి సూపరువైజరు, ఫార్మాసిస్టు, ఎల్‌టి ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎఎన్ఎంఎస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటగిరి:లో

వెంకటగిరి: పరిసరాల పరిశుభ్రత తోనే వ్యాధులు వ్యాప్తిని అరికట్టవచ్చునని వెంకటగిరి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సతీష్ తెలిపారు. గురువారం డెండీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణతోనే డెంగీని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం, (చంద్రగిరి): దోమకాటు ఆరోగ్యానికి చేటని కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కుసుమ అన్నారు. చంద్రగిరిలో గురువారం ఉదయం వైద్యాధికారి డాక్టర్ కుసుమ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి రమణమ్మ, సి ఈశ్వరయ్య ఆరోగ్యపర్యవేక్షకులు శ్యామల, లలిత, వాసుదేవ, వెంకటేశ్వరావు, ఎం ఎల్ హెచ్ పి లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనమనంబేడులో సెల్ టవర్ నిర్మాణం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడు గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సెల్‌ఫోను వాడకం దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం ఎయిర్టెల్ నెట్‌వర్కు అందక నానా ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు ఈ ఎయిర్టెల్ సెల్ టవరు నిర్మాణం ఆనందదాయకమని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఉపయోగాలు, నష్టాలు ఉన్నాయని గ్రామంలో ఇలాంటి టవర్లు నిర్మించడం వల్ల కొన్ని జీవ జంతువులకు ప్రమాదం ఉందని కొంత మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సెల్ ఫోన్‌కు టవర్ అందక నానా ఇబ్బందులు పడుతున్నారని ఇక్కడ టవర్ ఏర్పాటు చేయడంతో నెట్ వర్కు ఇబ్బందులు కనిపించవని యువకులు సంతోషిస్తున్నారు.

రెడ్డివారి గురవారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డిని గురువారం ఆ పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. రెడ్డివారి గురవారెడ్డి మరెన్నో పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుప తి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, తొట్టంబేడు మండలం టీఎన్ టీ యూసీ అధ్యక్షులు చింత గింజల సునీల్ కుమార్, ఆ పార్టీ నేతలు చంద్ర మహేష్ నాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ తాతయ్య, వీరాంజనేయులు, గురూజీ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **MEEJURU SAI SUSHWANTH,** S/o MEEJURU GOWRI SHANKAR (Old Name) residing at No.3-6-74, Old Shar Bus Stand, Raghavaiahpeta, Sullurpeta Town & Mandal, Tirupati District,(A.P.) do hereby change my name as **MEEJURU SAI SUSHWANTH REDDY,** S/o Meejuru Gowri Shankar (New Name)

బహిరంగ ప్రకటన

తిరుపతి నగరము, వి.వి.మహల్‌రోడ్డు, పి.యం.ఆర్.ప్లాజా మిద్దెపై గల ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి శాఖ ఏరియా మేనేజర్ సూచనల మేరకు ఇచ్చు బహిరంగ ప్రకటన ఏమనగా.. నాయుడుపేట కాపురస్తులైన **సుధాకర్ గారి కుమారుడు వి.నాగసుధీర్‌కుమార్ గారు** దిగువ కనబరచిన స్థిరాస్తిపై సదరు స్థిరాస్తికి దఖలు పడి **కె.కళ్యాణి పేరిట గావించబడిన రిజిష్టర్డ్ విక్రయపత్రం నెం.1242/2020** ప్రస్తుతం అందుబాటులో లేని పత్రముల ఆధారంగా గృహరుణ మంజూరి విషయమై పై వారలను సంప్రదించినారు. కావున సదరు స్థిరాస్తిపై ఎవరికేనీ ఆక్షేపణ అభ్యంతరాలున్న యెడల అట్టివారు ప్రకటన తేది నుండి 7 రోజులలోగా తమ ఆక్షేపణ అభ్యంతరాలను తగు సాక్షాధారములతో నాకు గానీ, ఏరియా మేనేజరు గారికి కానీ తెలుపగలరు. గడువులోగా ఎలాంటి ఆక్షేపణలు రాని యెడల ఎవరికేనీ ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి తదుపరి రుణ మంజూరీ విషయం పరిశీలించ బడును. గడువు మీరిన పిమ్మట వచ్చు ఆక్షేపణ, అభ్యంతరాలు పరిశీలించబడవని గమనించగలరు.

SCHEDULE: SPSR Nellore Revenue District, Gudur Regn District, Naidupeta Sub-District, Naidupeta Mandal and Municipality Ward No.6, Block No.12, Pitchireddy Thopu, LA Sagaram @ agraharapupeta Village Landa Western Side of the House bearing D.No.6-12- 633/1, Patta No.429, Sy.No.13/A1- Ac.0.80 Cents, Patta No.429, Sy.No.14-2A1 - Ac0.20 Cents, Total Ac.1.00 cents Plot No.53A, In this RCC Ground and Frist Floor Slab House built in a site measuring East : 20 ft, West : 20ft North : 60 Ft. South : 60ft admeasuring 1200 Sq.ft or 133.33 Sq.yds. Bounded by East: 20ft Wide road, South: Plot No.52 belongs to P.Dileep Kumar, West: Site Belongs to D.Jayalakshmi, North:site Belongs to K.Kalyani

ప్రదేశం: తిరుపతి
తేది: 16.05.2024
ఎ.సుదర్శనబాబు, ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ప్యానెల్ న్యాయవాది, 18-1-28/8ఎ, శాంతి నగర్, కె.టి.రోడ్డు, తిరుపతి, సెల్: 9849509162, 0877-2234272

In The Court of the I Addl. Junior Civil Judge: Tirupati
O.S.No. 658/2023

UCo Bank Tirupati. Rep. by its Senior Branch Manager ...Plaintiff
V/s
N.Siddamma ...Defendant

SUIT SUMMONS TO DEFENDANT

Smt. No.Siddamma wife of E.Narasimhulu D.No.22-13-206, Tirumala Nagar, Settipalli, Tirpati urban mandal, Tirupati District.

Please take suit summons that the above suit filed by the plaintiff for recovery of money and matter is posted to 20.06.2024 for your appearance either in person or through your Counsel at about 10.30 AM before the above mentioned court without fail. Failing which the matter will be decided exparte.

Date of Hearing : 20.06.2024

KATTAMANCHI RAMANAIAH
A.SUBRAMANYAM
Advocate, Tirupati.